గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

గ్రంథాలయ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

- అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 27: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, నిరుద్యోగులు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దనపు కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, ఎంతోమందిని ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో గ్రంథాలయ పాత్ర ఉందన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి చేపట్టనున్న తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జీపీఆర్వో ఏడుకొండలు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్, విద్యార్థులు

నర్సాపూర్, జనవరి 27: జిన్నారం మండలం నుంచి బాలానగర్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని జిన్నారం మండలానికి చెందిన విద్యార్థులు శనివారం నర్సాపూర్ డిపో ఇన్‌చార్జి(ఎస్‌టీవో) లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. జిన్నారం మండలకేంద్రం నుంచి బాలానగర్ వరకు గతంలో బస్సు సౌకర్యం ఉందని, రెండు వారాలుగా బస్సులు రావడం లేదన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో సమయానికి విద్యా సంస్థలకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. బస్సులు లేకపోవడంతో విద్యార్థుల తోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించి, అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు ఏర్పుల శ్రీనివాస్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ జాతర ప్రారంభం

చిత్తారమ్మ ఆలయంలో హోమం చేస్తున్న బ్రాహ్మణులు

రామాయంపేట, జనవరి 27: పట్టణంలోని చిత్తారమ్మ ఆలయంలో వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. భక్తులు హోమాలు నిర్వహించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ వేదాంతి నాగరాజుచారి అమ్మవారికి అభిషేకాలు, నైవేద్యాలు సమర్పించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మాట్లాడుతున్న సివిల్ న్యాయమూర్తి జితేందర్

మెదక్ అర్బన్, జనవరి 27 : ఖైదీలకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... ఖైదీలు లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సాయం పొందవచ్చన్నారు. జైలులోని వంటశాలను పరిశీలించారు. న్యాయమూర్తి వెంట న్యాయవాదులు, జైలు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

చరిత్రలో నిలిచేలా గ్రామాభివృద్ధి చేశాం

నర్సాపూర్, జనవరి 27: చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేశానని సర్పంచ్ శివకుమార్ అన్నారు. శనివారం పెద్దచింతకుంట గ్రామంలో పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మార్టిన్ లూథర్, వైస్ ఎంపీపీ వెంకటనర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ సహకారంతో పల్లెప్రకృతి వనం, రోడ్లు, మురుగు నీటి కాలువలు, కరెంట్ స్తంభాలు, మంచినీటి సౌకర్యం, శ్మశానవాటిక, డంపింగ్‌యార్డ్, మినీ అంగన్‌వాడీ కేంద్రం పనులు చేశామన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు వాణీవెంకటేశ్, మల్లాగౌడ్, ప్రసాద్, దుర్గేశ్, నీలాశంకర్, అంజమ్మ, కోఆప్షన్ సభ్యుడు శోభావిష్ణు, ఆశ వర్కర్ సంధ్య, వీవోఏ కవిత, కార్యదర్శి సుల్తానాబేగం పాల్గొన్నారు.

మొక్కజొన్నతో సిరులు

- 100 రోజుల్లో పంట చేతికి
- ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి
- రామాయంపేట వ్యవసాయ డివిజన్‌లో 1550 హెక్టార్లలో మొక్కజొన్న సాగు

మొక్కజొన్న పంట రక్షణకు ఏర్పాటు చేసిన సోలార్ కంచె

రామాయంపేట, జనవరి 27 : రామాయంపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో రైతులు పత్తి, వరి పంటలకు బదులుగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఏటా పత్తి, వరి సాగు చేసే రైతులు.. యాసంగిలో మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. గతేడాది అధికంగా పత్తి సాగు చేయగా, ఇప్పుడు మొక్కజొన్నను సాగు చేశారు. వీటితో పాటు అంతర పంటలుగా ఆముదం, కంది, బెబ్బెర్లు, పెసర, శనగను సాగుచేశారు. రామాయంపేట వ్యవసాయ డివిజన్‌లోని నిజాంపేట మండలంలో 650, చేగుంట మండలంలో 250, రామాయంపేటలో 485, నార్సింగి మండలంలో 30 మొత్తం 1415 హెక్టార్లలో మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. ఈ పంటను ఎక్కువ శాతం బిందు సేద్యం ద్వారానే సాగు చేస్తున్నారు. పంట సాగుకు ఖర్చు తక్కువ కావడంతో మార్కెట్‌లో మంచి ధర ఉంది. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాలతో 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. మొదట్లో మోగి పురుగు వచ్చినా.. దాన్ని మొగ్గదశలోనే నివారించారు. మొక్కజొన్న పంటను అడవి

రామాయంపేట మండలంలో పంటలను కాపాడడానికి ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మ

జంతువుల నుంచి రక్షించడానికి రైతులు సోలార్ కంచెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. సోలార్ కంచెలకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నది.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

యాసంగి సీజన్‌లో మొక్కజొన్న పంటను 1550 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. ఇప్పటికే 1415 హెక్టార్లలో సాగు చేశారు. మొక్క జొన్న సాగుకు ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువగా వస్తుంది. వర్షాభావ పరిస్థితులతో రైతులు మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నారు. పంటకు అధికంగా ఎండు తెగులు, కాండం తొలుచు వస్తుంది, తెగుళ్లను రసాయన మందును పిచికారీ చేసి, పంటను రక్షించవచ్చు. పూతదశలో పంటను కాపాడుకుంటే సిరులు కురిపిస్తుంది. అంతర పంటలను సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- వసంత సుగుణ, ఏడీఏ, రామాయంపేట

మున్సిపల్ దుకాణాలకు బహిరంగ వేలం వేయాలి

సీఎంకు పోస్టుకార్డులు పంపుతున్న యువజన సంఘాల జేఏసీ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 27: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాల కు బహిరంగ వేలం వేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి యువజన సంఘాల జేఏసీ నాయకులు శనివారం పోస్టు కార్డులు పంపించారు. జేఏసీ నాయకుడు బాలరాజు మాట్లాడుతూ మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాలను 45 ఏండ్లుగా నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు కేటాయించారన్నారు. ఒకే వ్యక్తికి 15 దుకాణాలు ఇచ్చారని ఆరోపించారు. పలు విషయాలను మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి దుకాణాలకు బహిరంగ వేలం వేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన సంఘాల జేఏసీ నాయకులు ప్రవీణ్, సుధాకర్, ఆనంద్, అరవింద్, కృష్ణ, మహేశ్, సుందర్, జగదీశ్, లక్ష్మణ్, రాములు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాత

రామాయంపేట, జనవరి 27: మండలంలోని అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం సైబర్ నేరాలపై పోలీసు కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, వారికి ఎలాంటి సమాచారం ఇవొద్దని, మూఢ నమ్మకాలు నమ్మవద్దన్నారు. బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. వేధింపులు జరిగితే పోలీసులకు తక్షణమే సమాచారం ఇవ్వాలని షీటీం సూచించింది.

విద్యుత్ సరఫరా నిలిపివేత

వెల్దుర్తి, జనవరి 27: వెల్దుర్తిలో సబ్‌స్టేషన్ మరమ్మతులు నిర్వహిస్తుండడంతో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి, శేరీల, ఎలుకపల్లి, చర్లపల్లి, కుకునూర్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- కలెక్టర్ రాజర్షిషా
- ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో డీఈవోతో కలిసి తనిఖీ

నర్సాపూర్‌లో విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

నర్సాపూర్, జనవరి 27 : పదో తరగతి, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధ్యాపకులు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శనివారం నర్సాపూర్‌లోని ఎల్లంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌తో కలిసి కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు వచ్చే రెండు నెలలు కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. టీవీ, సోషల్ మీడియా, ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, లెక్చరర్లు నిరంతరం పరిశీలించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రిపరేషన్‌పై ముచ్చటించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, ఎంఈవో బుచ్చానాయక్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'కస్టమర్ కేర్' సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 27: మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది విద్యార్థినులకు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి జూమ్లానాయక్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు గెలుపు

జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీలలో గెలుపొందిన తెలంగాణ జట్టు సభ్యులు

చిన్నశంకరంపేట, జనవరి 27: జాతీయ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు సత్తా చాటింది. ఢిల్లీలో నిర్వహించిన అండర్-19కబడ్డీ పోటీల్లో హర్యానా జట్టుతో తెలంగాణ జట్టు తలపడి విజేతగా నిలిచి మొదటి బహుమతి సాధించింది. నాలుగు రాష్ట్రాల జట్లు ఫైనల్‌కు చేరాయి. తెలంగాణ జట్టులో చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి తండాకు చెందిన దినేశ్, వినోద్, సందీప్ (కొర్విపల్లి తండా) పాల్గొన్నారు.

కరాటేలో పైతరవాసికి బ్లాక్‌బెల్ట్

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న మల్లేశం

కొల్చారం, జనవరి 27: హైదరాబాద్‌లోని బోడుప్పల్ ఇస్మార్ట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెంజుకి షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. చీఫ్ ఎగ్జామినర్‌గా నగేశ్, అబ్జర్వర్లుగా నవీన్, లావణ్య వ్యవహరించారు. కరాటే బెల్ట్ ఎగ్జామ్‌కు వివిధ జిల్లాల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు వచ్చారు. కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన కుసంగి పెద్ద మల్లేశం బ్లాక్ బెల్ట్ 3వ డాన్‌లో ఉత్తీర్ణత సాధించాడు. కొల్చారం మండలంలో సుమారు 3 వేల మందికి మల్లేశం ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నారు.

న్యాయ సాయం అందించాలి

మెదక్ అర్బన్, జనవరి 27 : ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయసాయం అందించాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ అన్నారు. శనివారం జిల్లా కోర్టుల సముదాయంలో ప్యానల్ లాయర్లు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రామాయంపేట, జనవరి 27: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. నిజాంపేట మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన రావిపల్లి నరేందర్‌రెడ్డి(60) సొంత పనుల నిమిత్తం బైక్‌పై రామాయంపేటకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఆర్.వెంకటాపూర్ గ్రామానికి చేరుకోగానే బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో నరేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

పోలీసు విధులపై అవగాహన

చేగుంట, జనవరి 27: పోలీసుల విధులపై విద్యార్థులకు ఎస్సై హరీశ్‌గౌడ్ అవగాహన కల్పించారు. చేగుంట పోలీస్‌స్టేషన్‌లో శనివారం విద్యార్థులకు కేసు నమోదు, ఎఫ్ఆర్ఐ, కేసు దర్యాప్తు అంశాలను వివరించారు. పోలీసులు అందిస్తున్న సేవలు, అత్యవసర సమయంలో చర్యలు, న్యాయ సహాయం విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు రవీందర్, రాంబాబు, సిబ్బంది భాస్కర్, రేణుక, ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, రఘుపతి, చక్రధర్‌శర్మ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..

చిన్నశంకరంపేట, జనవరి 27: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయలైన ఘటన చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్‌పరిధిలోని రాంజీతండా వద్ద శనివారం జరిగింది. చిన్నశంకరంపేటకు చెందిన ప్రభాకర్ బైక్‌పై మెదక్ పట్టణానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. కొర్విపల్లి తండాకు చెందిన శాంతి, చందర్ బైక్‌పై మెదక్ దవాఖానకు వెళ్తున్నారు. ఈ క్రమంలో టి.మాందాపూర్‌లోని రాంజీతండా వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను మెదక్ దవాఖానకు తరలించారు.

టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడిగా నరేందర్

టీఎన్జీవో జిల్లా కార్యవర్గం

మెదక్, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల (టీఎన్జీవో) మెదక్ జిల్లా అధ్యక్షుడిగా మెదక్ పట్టణానికి చెందిన దొంత నరేందర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఎన్జీవో భవన్‌లో జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా తోట కుమార్ నీల వ్యవహరించగా, జిల్లా పరిధిలోని ఏడు యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, డిపార్ట్‌మెంట్‌ల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. టీఎన్జీవో జిల్లా కార్యదర్శిగా రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఇక్బాల్ పాషా, కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా మనోహర్, ఫణీరాజ్, ఫజలుద్దీన్, అర్షద్, రఘునాథ్‌రావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా లీలా, జెయింట్ సెక్రటరీలుగా శంకర్, చిరంజీవ చార్యులు, శివాజీ, కిరణ్‌కుమార్, రాధ, కార్యాలయ కార్యదర్శిగా సలీం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా గోపాల్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా నర్సింహులు, ఈసీ సభ్యులుగా మరియా, శ్రీదేవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాండ్ల అనురాధ, నాయకులు శేషాచారి, సూర్య శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, ప్రభాకర్, శంకర్‌గౌడ్, ప్రశాంత్, నగేశ్, శ్రీనివాస్, సంతోష్, సలావుద్దీన్, మంజుల, నవనీత పాల్గొన్నారు.

ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు

వెల్దుర్తి, జనవరి 27 : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలు చేపట్టినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్లు తులసీరాం, జ్ఞానజ్యోతి, ఎస్సై మధుసూదన్‌గౌడ్ హెచ్చరించారు. ఇసుక, మట్టి తవ్వకాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మతో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో ఇసుక, మట్టి, ఎర్రమట్టి, తవ్వకాలు చేపట్టడం లేదా తరలించడానికి అనుమతులు లేవన్నారు. ఇసుక, మట్టి అవసరం ఉన్నవారు మైనింగ్‌శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేసినా, తరలించిన కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇసుక, మట్టి తవ్వకాలు, రవాణాపై పంచాయతీ కార్యదర్శులు నిఘా పెట్టాలని, వాహనాలను అడ్డుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇసుక, మట్టి తవ్వకాలపై నిర్వహించిన సమావేశానికి మైనింగ్, ఇరిగేషన్ అధికారులు హాజరుకాలేదు. పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించడం గమనార్హం.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

టీపీటీఎఫ్ జిల్లా సదస్సుకు తరలిరావాలి

పాపన్నపేట, జనవరి 27: ఫిబ్రవరి 4న మెదక్ లో నిర్వహించే విద్యా సదస్సుతో పాటు 11, 12 తేదీల్లో నిర్వహించే విద్యావైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్‌రాంరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పాపన్నపేట మండలంలోని పాఠశాలలను సందర్శించారు. మెదక్‌లో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ కోదండరామ్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, నర్సింహారెడ్డి, వేణుగోపాల్ హాజరవుతారని తెలిపారు. ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హీరాలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండలాధ్యక్షుడు బాలరాజ్, ప్రధాన కార్యదర్శి రమేశ్, వీర్‌కుమార్ ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే సునీతారెడ్డి కొల్చారంలో పర్యటన

కొల్చారం, జనవరి 27 : కొల్చారం మండలంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పర్యటిస్తారని బీఆర్ ఎస్ మండలాధ్యక్షుడు గౌరీశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటిగడ్డమాందాపూర్, నాయిన్ జలాల్‌పూర్, కొంగోడు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యక్రమాలకు జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

బహుమతులు అందజేత

రామాయంపేట, జనవరి 27 : రామాయంపేట మండలం దామరచెర్వు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రతిభతోపాటు వంద శాతం హాజరుశాతం ఉన్న ముగ్గురు విద్యార్థులకు శనివారం మాజీ ఉప సర్పంచ్ రాజు రూ.500 చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థానానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజాంపేటలో వైద్యశిబిరం

నిజాంపేట, జనవరి 27 : మండలకేంద్రం నిజాంపేటలో లయన్స్ క్లబ్, స్నేహ బంధు ప్రతినిధి రమేశ్, మెడిసిటీ దవాఖా న సిబ్బంది సంయుక్తంగా శనివారం ఉచి త వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య సి బ్బంది గ్రామస్తులకు కంటి, బీపీ, షుగర్ ఇతర పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కంటి శస్త్రచికిత్స అవసరమున్నవారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. వైద్యశిబిరంలో వైద్యసిబ్బంది ఐశ్వర్య, సుచిత్ర, వర్షిణి, జిక్రా, రాజాగౌడ్, సంజయ్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ వితరణ

రామాయంపేట, జనవరి 27: రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలో మృతదేహాన్ని భద్రపరిచే ఫ్రీజర్‌ను శనివారం దాతలు పంచాయతీకి అందజేశారు. ధర్మారం గ్రామానికి చెందిన పెంటయ్య, రాములు, లక్ష్మణ్ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్‌ను సర్పంచ్ బొడ్డు శంకర్, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాంరెడ్డికి అందజేసి, తమ సేవాగుణాన్ని చాటుకున్నారు.

జ్యుడీషియల్ ఎంప్లాయీస్ డెవలప్‌మెంట్ సొసైటీ ఎన్నిక

ఎన్నికైన సొసైటీ సభ్యులు

మెదక్ అర్బన్, జనవరి 27: జ్యుడీషియల్ ఎంప్లాయీస్ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బస్వరాజ్ శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రావన్‌కుమార్, జనరల్ సెక్రటరీగా మహ్మద్‌షాబుద్దీన్, సహాయ కార్యదర్శిగా మహ్మద్ సమీయొద్దీన్, కోశాధికారిగా రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లుగా షేక్ ఫసి అహ్మద్, జీవన్ ఎన్నికయ్యారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

కొల్చారం, జనవరి 27: భవనం పైనుంచిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన కొల్చారం పీఎస్ పరిధిలో శనివారం తెల్లవారుజామున జరిగింది. రాంపూర్ గ్రామానికి చెందిన ఎరుకల మల్లేశం(38) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం గ్రామంలో నిర్మిస్తున్న రెండంతస్తుల భవనంపై ఎక్కి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ ప్రమాదస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలను సేకరిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహ్మద్ గౌస్ తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

కొల్చారం, జనవరి 27 : కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తర గతులను శనివారం ఎంఈవో నీలకంఠం పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్ష ల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామాయంపేట, జనవరి 27 : రామాయంపేట 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పెంట్యానాయక్ శనివారం పేర్కొన్నారు. రామాయంపేటతోపాటు దామరచెర్వు, వెంకటాపూర్(ఆర్), కోమపల్లి, గొల్పర్తి, అక్కన్నపేటతోపాటు పరిశ్రమలకు మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — భారత ప్రభుత్వరంగ సంస్థ

అస్సెట్ లికవలీ శాఖ
#249/3RT, 1వ అంతస్తు, S.R. నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్ - 500 038.

ఇ-వేలం అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటార్(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు దిగువ తెలిపిన బకాయిలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "ఏది ఉంటే అది" మరియు "అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికన దిగువ తెలిపిన తేదీన విక్రయించబడుతుందని ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు గ్యారంటార్(లు)కు మరియు సాధారణ ప్రజలకు